సాక్షి
వికారాబాద్
బుధవారం । 22 । మార్చి । 2023



'కల్యాణలక్ష్మి' పేదలకు వరం
సంక్షేమ పథకాలు అమలులో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో ఉందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. 8లో▸



బ్యాంక్ సిబ్బంది నిర్వాకం..
బ్యాంక్ సిబ్బంది నిర్వాకం ఓ ఖాతాదారుడికి శాపంగా మారింది. ఒకరి ఖాతాకు మరొకరి పాన్ నంబర్ లింక్ చేశారు. 8లో▸



మహమ్మారిని తరిమికొడదాం
క్షయ(టీబీ)వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీబీ చికిత్స పర్యవేక్షకుడు రాహత్ అలీ హైదర్ అన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

ఉగాది శుభాకాంక్షలు



కలెక్టర్ నారాయణరెడ్డి

అనంతగిరి: జిల్లా ప్రజలు, అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి కలెక్టర్ నారాయణరెడ్డి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, తెలుగు నూతన సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

ప్రభుత్వ నిధులతో లైబ్రరీలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ రేణుకాదేవి

వికారాబాద్ అర్బన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాల్లో ప్రభుత్వ నిధులతో పూర్తి స్థాయిలో గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తున్నామని డీఈఓ రేణుకాదేవి తెలిపారు. లైబ్రరీల నిర్వహణపై స్థానిక ప్రభుత్వ డైట్ కళాశాలలో మంగళవారం ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రంథాలయాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుని, పఠన సామర్థ్యాలు పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రస్తుత డిజిటలైజ్ యుగంలో పఠనాసక్తి తగ్గిందన్నారు. దీన్ని పెంచాల్సిన భాధ్యత ఉపాధ్యాయులపై ఉందని తెలిపారు. జిల్లాలోని 154 స్కూళ్లు లైబ్రరీల ఏర్పాటుకు ఎంపికయ్యాయని వెల్లడించారు. తొలిమెట్టు కార్యక్రమానికి అనుసంధానం చేసి, విద్యార్థుల్లో అభ్యసన, భాష సామర్థ్యాలను పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి రవి, ఎస్ఆర్‌పీ వీరేశం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నిధుల కోసం నిరసన



ఘనపూర్ జీపీ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సర్పంచ్, వార్డు సభ్యులు

కుల్కచర్ల: ఎస్ఎఫ్‌సీ, 14 ఫైనాన్స్ నిధులు వెంటనే విడుదల చేయాలని ఘనపూర్ సర్పంచ్ విజయలక్ష్మివేణుగోపాల్ అన్నారు. ఈ మేరకు మంగళవారం పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జీపీలకు నిధులు విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తోందని ఆరోపించారు. పంచాయతీ ఖాతాలు ఫ్రీజ్ చేయడంతో పాలకవర్గాలు ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. స్తంభింపజేసిన ఖాతాలను పునరుద్ధరించాలని, పూర్తి చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బీరయ్య, వార్డు సభ్యులు భోజ్యా నాయక్, బాలయ్య, శ్రీనివాస్, శేఖర్ గౌడ్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పార్కుల్లో పరిశుభ్రత పనులు



పార్కులో చెత్త ఏరేస్తున్న సిబ్బంది

వికారాబాద్ అర్బన్: మున్సిపల్ పరిధిలోని పార్కులను సుందరంగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర తెలిపారు. పట్టణంలో ఏర్పాటు చేసిన కొత్త లే అవుట్లలోని పార్కుల్లో పిచ్చి మొక్కలను తొలగించి, శుభ్రం చేయిస్తున్నామన్నారు. త్వరలోనే వీటిలో అన్ని రకాల మొక్కలు నాటుతామని స్పష్టంచేశారు. అన్ని విభాగాల అధికారులకు ఈ బాధ్యతలను అప్పగించామన్నారు.

సర్వపాప హరణం రామలింగేశ్వర దర్శనం



స్వామివారి అభిషేకంలో ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

బండవెల్కిచర్ల గ్రామ పరిధిలో వెలసిన పాంబండ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు కనులపండువగా సాగుతున్నాయి. మంగళవారం జిల్లా నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి, స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయించారు. ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. బుధవారం ఉగాది పచ్చడి పంపిణీతో వేడుకలు ముగుస్తాయి. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్‌నాయక్, ఆలయ చైర్మన్ రాములు, ఈఓ సుధాకర్, బీఆర్ఎస్ నేతలు రాజు, శేరి రాంరెడ్డి, హరికృష్ణ, ఆలయ అర్చకుడు పాండు తదితరులు పాల్గొన్నారు. – కుల్కచర్ల



స్వామివారి దర్శనానికి భక్తుల క్యూ



ధారూరులో తుది దశకు చేరుకున్న డబుల్ బెడ్ రూం ఇళ్లు

డబుల్ వేగం

పనుల పూర్తికి సర్కారు ఆదేశం
- ప్రత్యేకంగా దృష్టిసారించిన కలెక్టర్
- ఆర్డీఓలు, తహసీల్దార్లతో సమీక్ష
- సోమవారం నుంచి దరఖాస్తుల స్వీకరణ

వికారాబాద్: డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం, పంపిణీపై కలెక్టర్ నారాయణరెడ్డి ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. వీటికి భూమి పూజ చేసి ఆరేళ్లు కావస్తున్నా జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు 1,079 నిర్మాణాలు మాత్రమే తుది దశకు చేరుకున్నాయి. అయితే ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రభుత్వం దృష్టి సారించింది. నిర్మాణం పూర్తయి చిన్నచిన్న పనులు మిగిలి ఉన్న ఇళ్లను అందుబాటులోకి తేవాలని ఆదేశించింది. ఈ మేరకు మంగళవారం ఆర్డీఓలు, తహసీల్దార్లతో మంగళవారం కలెక్టర్ నారాయణరెడ్డి సమీక్ష నిర్వహించారు. పనులను వేగవంతం చేయడంతో పాటు పేదలకు పంపిణీ చేసే ప్రక్రియలో పాటించాల్సిన విధివిధానాలను వివరించారు. జిల్లావ్యాప్తంగా తుదిదశకు చేరిన ఇళ్లను మూడు వారాల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. కరెంటు సరఫరా, కలర్లు, నీటి సౌకర్యం తదితర వసతులు కల్పించాలని దిశానిర్దేశం చేశారు.

తుది దశలో 1,079 ఇళ్లు

జిల్లాకు ప్రభుత్వం మొదట్లో 5,740 డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేసింది. 2016లో పనులకు భూమి పూజ చేశారు. ఆతర్వాత వీటి సంఖ్యను 3,800 కుదించారు. ప్రస్తుతం 2,257 ఇళ్లు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. 1,079 ఇళ్ల చిన్న పనులు మినహా పూర్తి కావచ్చాయి. 1,543 ఇళ్లకు సంబంధించిన పనులు ప్రారంభం కాలేదు. చివరి దశలో ఉన్న ఇళ్లలో పనులు వేగిరం చేశారు. మూడు వారాల్లో వీటిని పంపిణీకి సిద్ధం చేయనున్నారు. ధారూరులో 120, మర్పల్లి 120, యాలాల మండలం కోకట్ 180, తాండూరు పట్టణంలో 401, పరిగి 180, కొడంగల్ 48, చౌడాపూర్ మండలం అడవి వెంకటాపూర్‌లో 30 ఇళ్లను లబ్ధిదారులకు అందించనున్నారు.

పారదర్శకత పాటించేలా..

జిల్లాకు చెందిన ఆయా మండలాలు, పట్టణాల్లో పూర్తి కావచ్చిన ఇళ్లకు సంబంధించి లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందు కోసం వచ్చే సోమవారం నుంచి వారం రోజుల పాటు గ్రామ సభలు ఏర్పాటు చేసి, పేదల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. పట్టణాల్లో దరఖాస్తుల స్వీకరణకు వార్డుల వారీగా కౌంటర్లు ఏర్పాటు చేయనున్నారు. వచ్చిన దరఖాస్తులపై వారం రోజుల పాటు విచారణ చేస్తారు. స్థానిక ఎమ్మెల్యేల సమక్షంలో తహసీల్దార్లు ఈ పనిని పూర్తి చేస్తారు. గూడు లేని నిరు పేదలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని, దఖాస్తులు ఎక్కువగా వచ్చిన చోట లాటరీ విధానాన్ని అనుసరించాలని నిర్ణయించారు. ఎంపిక అనంతరం ఆర్డీఓల ద్వారా నివేదికను అడిషనల్ కలెక్టర్‌కు అందజేస్తారు.

పంపిణీకి ఏర్పాట్లు

నిర్మాణాలు పూర్తి కావచ్చిన ఇళ్ల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నాం. మండల, డివిజన్ స్థాయిలో సంబంధిత అధికారులకు బాధ్యతలు అప్పగించాం. మూడు వారాల్లో 1,079 ఇళ్లను పూర్తి చేయాలని ఆదేశించాం. దరఖాస్తులు స్వీకరించిన తర్వాత లబ్ధిదారులను ఎంపిక చేస్తాం. ఈ ప్రక్రియ పారదర్శకంగా కొనసాగుతుంది. అర్హులైన నిరుపేదలకే ఇళ్లు దక్కేలా తగిన చర్యలు తీసుకుంటాం. సాధ్యమైనంత త్వరగా డబుల్ బెడ్ రూం ఇళ్ల పనులు పూర్తిచేయిస్తాం.
– నారాయణరెడ్డి, కలెక్టర్

మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



అవగాహన సదస్సులో మత్స్యశాఖ జిల్లా అధికారి సరితారెడ్డి

పరిగి: మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని ఆ శాఖ జిల్లా అధికారి సరితారెడ్డి అన్నారు. పట్టణంలోని బోయవాడలో మంగళవారం మత్స్యకారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం అందజేస్తున్న పథకాలతో ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ప్రతీ మత్స్యకారుడికి వల వేయడం, ఈత కొట్టడం తప్పనిసరిగా రావాలన్నారు. నూతన సంఘాల ఏర్పాటు విషయంలో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని వివరించారు. కార్యక్రమంలో ఏడో వార్డు కౌన్సిలర్ వెంకటేశ్, మత్స్య సహకార సంఘం మండల అధ్యక్షుడు ఆనెం నర్సింహులు, కార్యదర్శులు దుర్గాప్రసాద్, డైరెక్టర్లు ఆనెం ఆంజనేయులు, పాపయ్య, ప్రవీణ్, పెంటయ్య, అంజిలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ శ్రమదానం



శ్రమదానం చేస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

యాలాల: మండల పరిధిలోని అగ్గనూర్‌లో సింధు డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు మంగళవారం శ్రమదానం చేశారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. ప్రభుత్వ భవనాల వద్ద పేరుకుపోయిన చెత్త, పిచ్చి మొక్కలను తొలగించారు.

భారతీయ సంస్కృతి ఎంతో గొప్పది



వికారాబాద్‌లో స్వయం సేవకుల కవాతు

- హౌసింగ్ బోర్డు మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి
- వికారాబాద్‌లో కర సేవకుల కవాతు

అనంతగిరి: భారతీయ సంస్కృతి ఎంతో గొప్పదని, ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తోందని హౌసింగ్ బోర్డు మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఈమేరకు ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నగర సమ్మేళనం, ఉగాది ఉత్సవం, పథ సంచలన్ నిర్వహించారు. వికారాబాద్‌లోని ప్రధాన వీధుల మీదుగా సాగిన కర సేవకుల ర్యాలీ చిగుళ్లపల్లి గ్రౌండ్‌కు చేరుకుంది. అనంతరం ఇక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ధర్మ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలన్నారు. మంచి సమాజ నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ముఖ్యవక్తగా విచ్చేసిన ఆర్‌ఎస్‌ఎస్ అఖిల భారత కార్యకారిణి సభ్యుడు భాగయ్య మాట్లాడుతూ.. ఉగాది పండుగకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. ఈ పండుగలో కష్ట సుఖాల కలయికను తెలియజేస్తుందన్నారు. ప్రతిఒక్కరూ హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలని కోరారు. మాజీ మంత్రి డాక్టర్ ఏ.చంద్రశేఖర్, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి, ప్రధాన కార్యదర్శి పాండుగౌడ్, రాష్ట్ర నాయకులు శివరాజు, మాధవరెడ్డి అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రాంత సహ సంఘచాలక్ సుందర్‌రెడ్డి, విభాగ్ సంఘచాలక్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా సంఘ చాలక్ డాక్టర్ సత్యనారాయణగౌడ్, ప్రాంత బౌద్ధిక్ ప్రముఖ్ కూర జయదేవ్, ప్రచారక్ శ్రీధర్‌జీ, జిల్లా ప్రతినిధులు గోవర్ధన్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్ రావు

శంకర్‌పల్లి: ప్రైవేటు ఆస్పత్రి యాజమాన్యాలు నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్ రావు హెచ్చరించారు. పట్టణ కేంద్రంలోని మెగా ఆస్పత్రిని మంగళవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని రోగుల వార్డులు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శంకర్‌పల్లిలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో నిబంధనలు పాటించడంలేదని ఫిర్యాదులు అందుతున్నాయని పేర్కొన్నారు. పేద ప్రజల నుంచి ఇష్టానుసారంగా డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవన్నారు. అనుమతి లేకుండా మెగా ఆస్పత్రిలో అబార్షన్ చేశారని ఓ మహిళ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిందని, కలెక్టర్ ఆదేశాల మేరకు ఆస్పత్రిని తనిఖీ చేసినట్టు తెలిపారు. తమ ఆస్పత్రిలో ఏ మహిళకూ అబార్షన్ చేయలేదని యాజమాన్యం వివరణ ఇవ్వగా, పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందించనున్నట్లు డీఎంహెచ్ఓ పేర్కొన్నారు. అంతకు ముందు శంకర్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన ఆయన వైద్య సిబ్బంది పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సాధారణ ప్రసవాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతీ ప్రైవేటు ఆస్పత్రిలో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్, శంకర్‌పల్లి ఆస్పత్రి డాక్టర్ రేవతిరెడ్డి ఉన్నారు.

అడవిని సంరక్షించుకుందాం

అటవీ శాఖ చీఫ్ కన్సర్వేటర్ అధికారి సైదులు

మొయినాబాద్: అడవిని సంరక్షించుకోవడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని అటవీ శాఖ చీఫ్ కన్సర్వేటర్ అధికారి బి.సైదులు అన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న మృగవని జాతీయ పార్కులో మంగళవారం వేడుకలు నిర్వహించారు. వన ప్రదర్శన కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రకృతిపై అవగాహన కల్పించారు. జీవవైవిధ్యంపై షార్ట్‌ఫిలిం ప్రదర్శించారు. సఫారీ వాహనంలో ఎక్కించి మృగవని పార్కులోని జంతువులు, పక్షులు, ఔషధ మొక్కల గురించి వివరించారు. మానవాళి మనుగడకు ఉపయోగపడే ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం మృగవని పార్కులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ రాహుల్‌కిషన్ జాదవ్, ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ ప్రతిమ పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు ఆత్మీయ సమ్మేళనాలు



మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

మీర్‌పేట: బీఆర్ఎస్ పార్టీ పటిష్టతకు ఆత్మీయ సమ్మేళనాలు దోహదం చేస్తాయని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లతో మంగళవారం మీర్‌పేటలోని ఎస్‌వైఆర్ గార్డెన్స్‌లో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో పార్టీ ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు ఒక్కతాటిపైకి వచ్చి పార్టీ పటిష్టతకు పాటుపడాలన్నారు. ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలతో దేశానికే ఆదర్శంగా నిలిచిందని, దేశ ప్రజలంతా తెలంగాణ మోడల్ పరిపాలనను కోరుకుంటున్నారని అన్నారు. ప్రతి కుటుంబానికి కనీసం ఒక పథకంతో లబ్ధి చేకూర్చామని, ప్రభుత్వం చేసిన మంచి పనులు, అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ తీసుకెళ్లి విస్తృతంగా వివరిద్దామన్నారు. ఆ దిశగా 'అబ్‌కీ బార్ కిసాన్ సర్కార్' నినాదంతో ముందుకెళ్తున్నట్లు చెప్పారు. ప్రతిపక్షాల విమర్శలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ ఎల్.రమణ, జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో పార్టీ బలంగా ఉందని, మంత్రి సబితారెడ్డి, ప్రజాప్రతినిధులతో కలిసి ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ, మూసీ రివర్‌బోర్డు చైర్మన్, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్‌రెడ్డి, సురభి వాణీదేవి, దయానంద్, ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, అంజయ్య యాదవ్, జైపాల్‌యాదవ్, కార్పొరేషన్ల చైర్మన్లు ఆయాచితం శ్రీధర్, శ్రీనివాస్‌గుప్తా, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

25 నుంచి చౌడేశ్వరీదేవి ఉత్సవాలు


చౌడేశ్వరీ మాత

కొడంగల్ రూరల్: పట్టణ శివారులో వెలసిన శ్రీ నందవరం చౌడేశ్వరీ దేవి 29వ జ్యోతి ఉత్సవాలు ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు సీ పవన్‌కుమార్, సీ శివకుమార్ తెలిపారు. 25వ తేదీ సాయంత్రం 4గంటలకు జల్ది బిందె కార్యక్రమం, రాత్రి 7గంటలకు అమ్మవారికి పంచామృతాభిషేకం, భజన నిర్వహించనున్నట్లు తెలిపారు. 26వ తేదీ ఉదయం 5గంటలకు జ్యోతి ఉత్సవాలు, 27వ తేదీన ఉదయం 10గంటలకు పెరుగు బసంతం నిర్వహించనున్నట్లు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

మర్పల్లి: జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. మర్పల్లి ఎస్‌ఐ అరుణ్ కుమార్‌గౌడ్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిపురం గ్రామానికి చెందిన కిష్టయ్య(30) వ్యవసాయం చేసుకుంటూ జీవించేవాడు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కిష్టయ్య భార్య చనిపోయింది. కూతురి ఆరోగ్యం కోసం అప్పులు చేశారు. అప్పులు తీర్చలేక తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు మర్పల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుని తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. తల్లిదండ్రులు చనిపోవడంతో ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. వారిని ప్రభుత్వం ఆదుకోవాలని బంధువులు కోరారు.

బాలిక అదృశ్యం

పహాడీషరీఫ్: బాలిక అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై డి.శ్రీను తెలిపిన ప్రకారం.. పహాడీషరీఫ్ గ్రామానికి చెందిన మహ్మద్ ఫజల్ కుమార్తె ఫర్హానా బేగం(16) ఈ నెల 20న ఉదయం 7గంటలకు ఇంట్లోని కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో బయటి నుంచి గడియపెట్టి వెళ్లిపోయింది. ఎంతకి రాకపోవడంతో స్థానికంగా వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. ముజ్జు అనే యువకుడిపై అనుమానం ఉందంటూ ఫర్హానాబేగం సోదరీ మేరాజ్ ఫాతిమా మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కల దాడిలో ఆవు మృతి

తలకొండపల్లి: కుక్కలు దాడి చేసి ఓ ఆవును చంపేశాయి. ఈ సంఘటన మండల పరిధిలోని కోరింతకుంట తండాలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. తండాకు చెందిన ముడావత్ మల్లేశ్ తన వ్యవసాయ పొలంలోని పశువుల షెడ్‌లో రెండు ఆవులను ఉంచాడు. కుక్కలు ఆ ఆవులపై దాడి చేయడంతో ఓ ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. మరో ఆవుకు స్వల్ప గాయాలయ్యాయి. మృతి చెందిన ఆవు విలువ సుమారుగా రూ.లక్ష ఉంటుందని.. జీవనోపాధికి అప్పు చేసి ఆవు కొనుగోలు చేసానని.. ఇప్పుడు అప్పు ఎలా తీర్చాలని బాధితుడు విలపించాడు. ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నాడు.

భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు జైలు

ఇబ్రహీంపట్నం రూరల్: భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు ఐదేళ్ల జైలు శిక్ష విధించినట్లు ఆదిబట్ల సీఐ రవి కుమార్ తెలిపారు. ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని కొంగరకలాన్‌కు చెందిన ఉడుగుల అరుణ, శ్రీనివాస్‌కు 2001లో వివాహమైంది. ఈ దంపతులకు ఇద్దరు సంతానం. శ్రీనివాస్ అదనపు కట్నం కోసం భార్య అరుణను వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన అరుణ 2016 డిసెంబర్ 28న ఒంటిపై కిరోసిన్ పోసుకుని బలవన్మరణానికి పాల్పడింది. పూర్తి ఆధారాలను సేకరించిన పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. రంగారెడ్డి జిల్లా కోర్టులో ఐదేళ్లుగా కేసు పూర్వపరాలను పరిశీలించిన అనంతరం నిందితుడు శ్రీనివాస్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.4వేలు జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పు వెల్లడించినట్లు సీఐ తెలిపారు.

పేదలకు వరం 'కల్యాణలక్ష్మి'

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: సంక్షేమ పథకాలు అమలులో తెలంగాణ దేశంలోనే మొట్టమొదటి స్థానంలో ఉందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం పరిగి మండల పరిషత్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్లకు కల్యాణలక్ష్మి పథకం అండగా నిలుస్తోందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అనేక పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల ప్రజలు తెలంగాణలో అమలు అవుతున్న పథకాలు అమలు చేయాలని కోరుతున్నారని తెలిపారు. దేశ ప్రజలందరు తెలంగాణ వైపు చూస్తున్నారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి దేశానికి ఆదర్శమన్నారు. అర్హులు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్ రావు, జెడ్పీటీసీ హరిప్రియ, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ రాజేందర్, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు రవికుమార్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

పూడూరు: విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం పరిగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. అలాగే మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి మంచి మార్కులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లేశం, జెడ్పీటీసీ మేఘమాల, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అజారుద్దీన్, పార్టీ మండల అధ్యక్షుడు మైపాల్‌రెడ్డి, నాయకులు రహీస్‌ఖాన్, అనంత్‌రెడ్డి, హరీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ. లక్ష పరిహారం ఇవ్వాలి

- మాజీ మంత్రి చంద్రశేఖర్, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- మండలంలో దెబ్బతిన్న పంటల పరిశీలన

మర్పల్లి: వడగండ్ల వానకు పంటలు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ. లక్ష పరిహారం ఇవ్వాలని మాజీ మంత్రి డాక్టర్ ఏ చంద్రశేఖర్, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని దామస్తాపూర్, మొగిలిగుండ్ల, మర్పల్లి, కొత్లాపూర్ గ్రామాల్లో వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఆయా గ్రామాల రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి పరిహారం వచ్చేవరకు తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మొక్కజొన్న, జొన్న పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. డ్రిప్ పరికరాలు పాడయ్యాయని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేయాలన్నారు. పరిహారంతోపాటు రైతు రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి, మర్పల్లి మండల అధ్యక్షుడు మల్లేశ్ యాదవ్, నాయకులు పాండుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీధర్ రెడ్డి, నరోత్తంరెడ్డి, బుచ్చిరెడ్డి, రామేశ్వర్‌రెడ్డి, పీ శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.


మర్పల్లిలో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న చంద్రశేఖర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

అడవుల రక్షణ అందరి బాధ్యత


మాట్లాడుతున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్యాంసుందర్‌రావు

- ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్యాంసుందర్‌రావు
- జినుగుర్తిలో అటవీ దినోత్సవం

తాండూరు రూరల్: అడవులను కాపాడడం అందరి బాధ్యత అని తాండూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్యాంసుందర్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని జినుగుర్తి గ్రామంలో ప్రపంచ అటవీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలకు అడవుల ప్రాముఖ్యత, ప్రయోజనాలు తెలిపేందుకు ప్రభుత్వం మార్చి 21న అటవీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం హరితహారం కింద ప్రతి ఏటా లక్షల మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. అనంతరం ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అటవీ సెక్షన్ ఆఫీసర్లు నాగజ్యోతి, అన్వర్ హుసేన్, కరన్ కోట్ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి, ఉప సర్పంచ్ హసీం అలీ, నాయకులు రాంలింగారెడ్డి పాల్గొన్నారు.

దుంప పంటల సాగు లాభదాయకం

ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్


వికారాబాద్ అర్బన్: బైక్‌పై పంటల పరిశీలనకు వెళుతున్న ఎమ్మెల్యే

వికారాబాద్ అర్బన్: దుంప పంటల సాగు లాభదాయకమని, రైతులు ఇలాంటి పంటల సాగుపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సూచించారు. మంగళవారం మండలంలోని నారాయణపూర్ రైతు వేదికలో కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలోని కూరగాయల పరిశోధన కేంద్రం, రాష్ట్ర ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖల ఆధ్వర్యంలో దుంప పంటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శాస్త్రవేత్తలు, ఉద్యానవన శాఖ అధికారుల సూచనలు, సలహాల మేరకు పంటలు సాగు చేయాలని సూచించారు. ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను, పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం జిల్లా ఉద్యానశాఖ అధికారి డీ చక్రపాణి మాట్లాడుతూ.. తెలంగాణలో చేమగడ్డ, మోరంగడ్డ సాగు అధికంగా ఉన్నట్లు తెలిపారు. తెలంగాణలో కేవలం రంగారెడ్డి జిల్లాలో మాత్రమే చేమగడ్డ సాగు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. వికారాబాద్ పట్టణ పరిసర ప్రాంతాలైన అత్వెల్లి, కొంపల్లి, మదన్‌పల్లి, ఎర్రవల్లి, పులుమద్ది గ్రామాల్లోని భూములు ఉద్యాన పంటలకు అనుకూలంగా ఉన్నట్లు తెలిపారు. హైదరాబాద్‌కు ఈ ప్రాంతం దగ్గరలో ఉండడం వల్ల కూరగాయల సాగు చేస్తే అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రైతు సమాఖ్య జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం అండగా ఉంటుంది

అనంతగిరి: పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. మంగళవారం వికారాబాద్ మండలం ఎర్రవల్లిలో వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు. పొలాల్లోకి కారు వెళ్లకపోవడంతో మోటారు సైకిళ్లపై వెళ్లి పంటలను పరిశీలించారు.

బ్యాంక్ సిబ్బంది నిర్వాకం.. ఖాతాదారుడికి శాపం

ఒకరి ఖాతాకు మరొకరి పాన్ నంబరు అనుసంధానం

- రుణం కోసం వెళితే అసలు విషయం వెలుగులోకి


బ్యాంక్ పాసుపుస్తకం చూపుతున్న పెద్దేముల్‌కు చెందిన మంగలి అనంతయ్య

పెద్దేముల్: బ్యాంక్ సిబ్బంది నిర్వాకం ఓ ఖాతాదారుడికి శాపంగా మారింది. ఒకరి ఖాతాకు మరొకరి పాన్‌కార్డు నంబరు అనుసంధానం చేశారు. ఇంటి నిర్మాణానికి లోన్ తీసుకునేందుకు వెళితే అసలు విషయం బయట పడింది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రమైన పెద్దేముల్‌కు చెందిన మంగలి అనంతయ్య తన పాత ఇంటిని కూల్చి కొత్త ఇంటి నిర్మాణం మొదలు పెట్టాడు. ఇందు కోసం ఆరు నెలల క్రితం తన 30గుంటల వ్యవసాయ భూమిని రూ.10 లక్షలకు విక్రయించాడు. ఈ డబ్బు సరిపోకపోవడంతో పనులు ఆగిపోయాయి. దీంతో వికారాబాద్‌లోని ఓ ప్రైవేట్ బ్యాంకును ఆశ్రయించాడు. అక్కడి సిబ్బంది మంగలి అనంతయ్య బ్యాంక్ పాస్‌బుక్‌ను చెక్ చేశారు. అతనికి వికారాబాద్‌లోని కెనరా బ్యాంకులో బైక్ లోన్ ఉన్నట్లు గుర్తించి అనంతయ్యకు తెలిపారు. తాను బైక్ లోన్ తీసుకోలేదని, మరోసారి చెక్ చేయాలని కోరాడు. దీంతో వారు అనంతయ్య బ్యాంక్ ఖాతాను పూర్తిగా పరిశీలించారు. ఆయన పేరున వికారాబాద్‌లోని కెనరా బ్యాంకులో ఖాతా ఉందని, 38 సార్లు రుణాలు పొందినట్లు గుర్తించారు. తనకు కెనరా బ్యాంకులో ఖాతా లేదని, అలాంటప్పుడు రుణాలు ఎలా పొందగలని బ్యాంక్ సిబ్బందిని అడిగాడు. ఈ విషయం తమకు తెలియదని సిబిల్ స్కోర్ చెక్ చేస్తే పూర్తి వివరాలు తెలుస్తాయని బ్యాంక్ సిబ్బంది అనంతయ్యకు వివరించారు. దీంతో ఆయన ఇంటర్‌నెట్ సెంటర్‌లో తన పాస్‌బుక్ ఆధారంగా సిబిల్ స్కోర్ చెక్ చేశాడు. నవాబుపేట మండలం పులిముద్ది గ్రామానికి చెందిన మంగలి అనంతయ్య పేరున ఖాతా ఉన్నట్లు గుర్తించాడు. తనది పులిముద్ది గ్రామానికి చెందిన వ్యక్తిది ఇంటి పేరుతో సహా ఒక్కటే కావడం చూసి ఆశ్చర్యపోయాడు. అతని బ్యాంక్ ఖాతాకు తన పాన్ నంబర్ అనుసంధానం అయినట్లు గుర్తించాడు. పులిముద్ది గ్రామానికి చెందిన మంగలి అనంతయ్య పేరున వికారాబాద్‌లోని కెనరా బ్యాంక్‌లో 38 అకౌంట్లు ఉన్నట్లు బయటపడింది. వాటిలో 12 ఖాతాలు మాత్రం పనిచేస్తున్నాయని, మిగతా 26 ఖాతాలు క్లోజ్ అయినట్లు తేలింది. ఇందులో ఎక్కువ శాతం బంగారు రుణాలు తీసుకున్నవే ఉన్నాయి. వాటిని తిరిగి చెల్లించడంతో అవి మూసివేశారు. అతని బ్యాంక్ ఖాతాకు తన పాన్ కార్డు నంబరు అనుసంధానం కావడంతో రుణాలు పొందిన అకౌంట్లు తన పేరిట చూపుతున్నాయని పెద్దేముల్‌కు చెందిన మంగలి అనంతయ్య తెలిపాడు. దీంతో పెద్దేముల్ పోలీసులను ఆశ్రయించాడు. రుణం పొందినట్లు చూపుతున్న బ్యాంక్ వికారాబాద్‌లో ఉన్నందున అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేయాలని స్థానిక పోలీసులు అనంతయ్యకు సూచించారు. దీంతో ఆయన వికారాబాద్ పోలీసులను ఆశ్రయించాడు. అతడు చెప్పిన ఆధారాలతో నవాబుపేట మండలం పులిముద్ది గ్రామానికి చెందిన మంగలి అనంతయ్యను స్టేషన్‌కు పిలిపించారు. నీకు పెద్దేముల్‌కు చెందిన మంగలి అనంతయ్య పాన్‌కార్డు ఎలా వచ్చింది..? అని ఆరా తీశారు. తనకు ఈ విషయం తెలియదని, రెండు రోజుల సమయం ఇస్తే పొరపాటు ఎక్కడ జరిగిందో తెలుసుకొని సరిచేసుకుంటానని అనంతయ్య పోలీసులను కోరాడు. న్యాయం జరిగేలా చూస్తామని పెద్దేముల్ అనంతయ్యకు పోలీసులు హామీ ఇచ్చారు. అయితే బ్యాంక్ సిబ్బంది పొరపాటున పెద్దేముల్‌కు చెందిన మంగలి అనంతయ్య పాన్ నంబర్ ఎంటర్ చేశారా? లేక నవాబుపేట మండలం పులిముద్ది గ్రామానికి చెందిన మంగలి అనంతయ్య పెద్దేముల్‌కు చెందిన మంగలి అనంతయ్య పాన్‌కార్డు నంబర్ ఇచ్చాడా అనేది తేలాల్సి ఉంది.

దేశ భవిష్యత్ కోసమే బీఆర్‌ఎస్

ఎమ్మెల్యే కాలె యాదయ్య


ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

షాబాద్: దేశ భవిష్యత్ కోసమే సీఎం కేసీఆర్ బీఆర్‌ఎస్ పార్టీని స్థాపించారని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మంగళవారం మండలంలోని మన్‌మర్రిలో 10 గ్రామ పంచాయతీల పార్టీ కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసి, శ్రేణుల్లో ఉత్తేజం నింపేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లేలా కార్యకర్తలే ప్రధాన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నారన్నారు. ఇప్పటి నుంచే నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలన్నారు. దేశంలోనే తెలంగాణ అభివృద్ధిలో అగ్రస్థానంలో ఉందని తెలిపారు. జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి మాట్లాడుతూ...తెలంగాణ వస్తే ఏం అభివృద్ధి సాధిస్తుందని అన్న వాళ్లకు సీఎం కేసీఆర్ అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి చూపించారని కొనియాడారు. చందనవెల్లి, సీతారంపూర్ పరిశ్రమల్లో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు ఇపిస్తామన్నారు. షాబాద్ మండలాన్ని జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదితామన్నారు. ప్రతి గ్రామానికి రోడ్లు, మురుగు కాల్వలు, బ్రిడ్జిల పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింగ్‌రావు, మాజీ చైర్మన్లు వెంకటయ్య, శ్రీనివాస్‌గౌడ్, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మొయినాబాద్ బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, సహకార సంఘం వైస్ చైర్మన్ మల్లేష్, డైరెక్టర్ నర్సింహులుగౌడ్, పార్టీ సీనియర్ నాయకులు శ్రీరాంరెడ్డి, అరీఫ్, బండ నర్సింహారెడ్డి, పాండురంగారావు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో రాణించాలి

సంఘం మండల అధ్యక్షుడు రాజు

నందిగామ: ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో రాణించాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు మేకం రాజు ముదిరాజ్ అన్నారు. మండల పరిధిలోని బుగ్గోనిగూడలో మంగళవారం ముదిరాజ్ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజు ముదిరాజ్ హాజరయ్యారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా బుగ్గ మల్లేష్, ఉపాధ్యక్షుడుగా శంకర్, ప్రధాన కార్యదర్శిగా పాండు, కోశాధికారిగా వెంకటయ్య, కార్యదర్శిగా రమే ష్, యువత కమిటీ అధ్యక్షుడిగా శివశంకర్, ఉపాధ్యక్షుడిగా అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్, కోశాధికారిగా అశోక్ తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

అంతిరెడ్డిగూడలో..

అంతిరెడ్డిగూడలో ముదిరాజ్ సంఘం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా శ్రీశైలం, ఉపాధ్యక్షుడిగా అంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా కృష్ణ, కోశాధికారిగా రమేష్, కార్యదర్శిగా ప్రవీణ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని గద్దె దించితేనే భవిష్యత్

ఇబ్రహీంపట్నం: కులాలు, మతాల పేరుతో చిచ్చుపెడుతున్న కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించితేనే ప్రజలకు భవిష్యత్ ఉంటుందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.జంగారెడ్డి అన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని ఆరోపించారు. కేంద్రం తీరుకు నిరసనగా వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా చేపట్టిన జీపుజాత మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన సభలో వారు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న మతోన్మాద బీజేపీ పాలనను అంతమొందించాలన్నారు. కార్మిక, కర్షక, వ్యవసాయ కూలీలను ప్రమాదంలో పడేసే విధానాలపై, నిర్ణయాలపై ప్రజా సంఘాలు సమర శంఖం పూరించాయన్నారు. ఏప్రిల్ 5న సుమారు 5లక్షల మందితో నిర్వహించే ఐక్యతా ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పెట్రో, డీజిల్, వంటగ్యాస్ సిలిండర్‌లతోపాటు నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచి పేదోడి నడ్డి విరుస్తోందన్నారు. నాయకులు మధుసూదన్‌రెడ్డి, రాంచందర్, జగన్, రాజు, చంద్రమోహన్, కవిత, ముసలయ్య, రామకృష్ణారెడ్డి, సామెల్, జంగయ్య, జగదీశ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జంగారెడ్డి

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు


సింహ వాహనంపై శ్రీవారు


హంస వాహనంపై వేంకటేశ్వర స్వామి

కొడంగల్: పేదల తిరుపతిగా పేరుగాంచిన పట్టణంలోని పద్మావతీ సమేత శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం శ్రీవారు దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సింహ వాహనంపై శ్రీవారిని అందంగా అలంకరించి మాఢ వీధుల్లో ఊరేగించారు. శ్రీవారి వాహన సేవలో పాల్గొని భక్తులు పులకించారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి వచ్చిన అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. సోమవారం రాత్రి శ్రీవారు హంసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారు సరస్వతి దేవి అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.